ప్రజాశక్తి
ఆదివారం 19 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు

వంతెనల పనులకు వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి పలు గ్రామాలకు నూతనంగా వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టాలని మండల ఎంపిడిఓ కిరణ్ కుమార్ కు స్థానిక సర్పంచ్ త్రినాథ్ వినతిపత్రాన్ని అందజేశారు. అతిమారుమూల ప్రాంతమైన గ్రామాలకు కనెక్టివిటీగా ఉన్న బ్రిడ్జిల నిర్మాణాలను వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కోరారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సానుకూలంగా స్పందించి పంచాయితి రాజ్ ఏఇతో మాట్లాడి లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని మూడు బ్రిడ్జిలు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారని సర్పంచ్ తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న త్రినాథ్

నిఘా నీడన ఇంటర్ పరీక్షలు

- సిసి కెమెరాలతో చూసిరాతలకు అడ్డుకట్ట
- 9 గంటలకే కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డీడీ పర్యవేక్షణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఏ పరిధిలోని పాడేరు డివిజన్ 11 మండలాల్లోని 16 పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేందుకు చర్యల్లో భాగంగా ఐటిడిఏలో అధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లోని సిసి కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పరీక్షలు జరిగే విధానాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నారు. ఐటిడిఏకు శనివారం ఉదయం 9 గంటలకే చేరుకున్న డిడి ఐ.కొండలరావు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలి రోజు పరీక్షల్లో సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి, చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతున్నట్లు వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలక్రిష్ణ ఆ విద్యార్థులను డిబార్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. మన్యంలో ఎన్నడూ లేని విధంగా చూచిరాతలకు అడ్డుకట్ట వేసేందుకు ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలక్రిష్ణ , అధికారులు తీసుకున్న చర్యలను పలువురు అభినందిస్తున్నారు.ప్రస్తుతం పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి.

కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డీడీ కొండలరావు

సీలేరులో వర్షంలో పరుగులు పెడుతున్న విద్యార్థులు

అకాల వర్షంతో అవస్థలు

ప్రజాశక్తి-సీలేరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంతోపాటు సీలేరు పరిసరాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసాయి. శనివారం ఉదయం 9 గంటల వరకు మబ్బులతో కూడిన వాతావరణం, అనంతరం మధ్యాహ్నం రెండు గంటల వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపాడు. తర్వాత వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకుని, సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం కురిసింది. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న విద్యార్థులు తడుస్తూ ఇంటికి పరుగులు తీశారు. మరోవైపు ఎ.బితోపాటు దారకొండ, గుమ్మిరేవుల, దుప్పిలివాడ తదితర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలతో జీడి,మామిడి పంటకు నష్టం వాటిల్లుతుందని గిరిరైతులు ఆవేదన చెందుతున్నారు. చింతచెట్టు ఫలసాయం చేతికొచ్చే సమయంలో వర్షపు జల్లులు కురుస్తుండడంతో తడిసి నష్టం వాటిల్లుతుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

డుంబ్రిగుడలో...

పాడేరుటౌన్: పాడేరులో వరుసగా రెండో రోజూ ముసురు వాతావరణం కొనసాగింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ముసురు అర్ధరాత్రి తెరిపిచ్చింది. శనివారం సాయంత్రం నాలుగున్నర గంటల తర్వాత వాన గంటసేపు కురిసింది. జన జీవనానికి అంతరాయం ఏర్పడింది.

డుంబ్రిగుడ: మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పిడుగు శబ్దాలతో కూడిన ఈదురు గాలుల వర్షం కురిసింది. ఈ వర్షంతో మండలంలో నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 516 రోడ్డు బురద మయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయంగా మారాయి.

పాడేరులో కురుస్తున్న వర్షం

మిరప రైతులను ఆదుకోవాలి : సిపిఎం

కల్లాల్లో ఎండబెట్టిన మిరప కాయలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ఎటపాక : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అకాల వర్షానికి కల్లాల్లో తడిసిన మిరపపంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది నాలుగు దఫాలుగా వచ్చిన గోదావరి వరదల కారణంగా, ఆలస్యంగా వేసిన మిరపపైరుకు నల్లిదోమ ఆశించి పంటను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. నల్లి దోమ నుంచి మిరపపంటను రక్షించడానికి రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి, పురుగుమందులు కొట్టినా ఆశించిన దిగుబడులు రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎకరాకు 20క్వింటాళ్ల వరకు రావాల్సిన మిరపకాయల దిగుబడి, నల్లిదోమ ఆశించడంతో గడచిన రెండేళ్లుగా ఐదు క్వింటాళ్లు రావడం గగనమౌతోందన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రస్తుతమున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలతో కల్లాల్లోని మిరపకాయలు తడిసి మరోసారి నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. మిర్చికి మంచి ధర వస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్న రైతులకు అకాల వర్షం కోలుకోలేని దెబ్బ తీసిందన్నారు. పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఎటపాక మండల కమిటీ డిమాండ్ చేసింది.

తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి

-కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అంగన్వాడీ కేంద్రాలలో బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అంగన్వాడి సిడిపిఒలను, సూపర్వైజర్లను ఆదేశించారు. కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిల్లలు బరువు పెరగక పోవటానికి కారణాలను విశ్లేషించి తదనుగుణంగా పోషకాహారాన్ని అందించాలని, అవసరమైతే డాక్టర్ల సహాయం తీసుకోవాలని సూచించారు. అటువంటి వారిని కొన్ని రోజులు పౌష్టికాహార పునరావాస కేంద్రంలో ఉంచి పౌష్టికాహారం అందించాలన్నారు. సూపర్వైజర్లు ప్రతి వారంలో కనీసం ఐదు రోజులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా గ్రామాలలో కొంత సమయం వారితో గడపి. వారికి అవసరమైన సూచనలు అందించాలన్నారు. చిన్నారులకు తల్లి పాలు పట్టే విధానం, పొజిషన్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఆయా అంగన్వాడీ కేంద్రాలలో స్టాక్ పరిశీలన చేయాలని, ప్రతి రోజు వంట వండుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. సూపర్వైజర్లు గ్రామాలను సందర్శించే తేదీలు ముందుగానే షెడ్యూల్ వేసుకుని, దాని ప్రకారం పర్యటించాలని, అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలపై ఆరా తీయాలని సూచించారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో కొన్ని రోజులు వంట చేయడం లేదని, ఇది తన దృష్టికి వచ్చినందున, కేంద్రాలకు ఎంతమంది వస్తున్నారు, ఎంతమందికి వంట చేస్తున్నారనేది పరిశీలించాలన్నారు. అంగన్వాడీలకు రాలేని బాలింతలు, గర్భిణీలకు టేక్ హోమ్ రేషన్ అందించాలన్నారు. గత సమావేశంలో అంగన్వాడీ కేంద్రాల సందర్శన ఫోటోలను తీయాలన్న ఆదేశాల అమలును కలక్టర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల సూపర్వైజర్లు తీసుకున్న ఫోటోలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, తక్కువ బరువున్న పిల్లల బరువులను ఒక రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఒక నెల రోజులు వ్యక్తిగతంగా పర్యవేక్షించి నెల తరువాత బరువును పరిశీలిస్తే ఖచ్చితంగా పెరుగుతుందని, పర్యవేక్షణ చేస్తూ, పౌష్టికాహారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శిక్షణా కలక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, పాడేరు డివిజన్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఉపాధి బిల్లుల సమస్య పరిష్కరించండి

స్థాయి సంఘం సమావేశంలో కోరిన జెడ్‌పిటిసి

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి జ్యోతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించి బిల్లుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి కోరారు. శనివారం కాకినాడలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతూ, ఉపాధిహామీ మెటీరియల్ వర్క్‌లు చేసినవారు ఒక విడత బిల్లులు అప్‌లోడ్ చేసుకున్నారని, మిగిలిన పని పూర్తి చేసిన తరువాత ఇపుడు బిల్లులు అప్‌లోడ్ కావడం లేదన్నారు. ముందుగా అప్‌లోడ్ చేసిన బిల్లులకు సంబంధించి చెల్లింపులు జరిగిన తర్వాతే రెండో విడత బిల్లులు అప్‌లోడ్ చేసుకునే విధంగా సాఫ్ట్‌వేర్ ఉందని, కానీ తొలుత అప్‌లోడ్ చేసిన పనులకు సంబంధించి బిల్లులు అందనప్పటికీ, మిగిలిన పనిని పూర్తి చేసి, మిగతా బిల్లులు అప్‌లోడ్ చేసే సమయంలో ఈ సమస్య ఉత్పన్నమౌతోందన్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టి, పూర్తిచేసిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టడంతోపాటు బిల్లులు చెల్లించాలని ఉపాధిహామీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను జెడ్‌పిటిసి జ్యోతి కోరారు.

త్వరలో డిప్లమో కోర్సు

ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్

ప్రజాశక్తి-పాడేరు: ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో త్వరలో డిప్లొమా కోర్సు ప్రవేశ పెట్టనున్నట్లు ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.భాలగంగాధర్ తిలక్ స్పష్టం చేసారు. పాడేరు పర్యటనలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాత్రికేయులతో ముచ్చటించిన ఆయన మాట్లాడుతూ, ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో పాత్రికేయులకు అనేక శిక్షణా తరగతులు నిర్వహిస్తూ వారికి వివిధ రకాల ఆర్టికల్స్, స్పాట్ న్యూస్, ఫీచర్ ఆర్టికల్స్, ఫీడ్ బ్యాక్, విజయగాధలు, ప్రెస్ మీట్లు తదితర అంశాలు రాయటంలో మెళుకువలు, పద్ధతులు నేర్పించడం జరుగుతోందని తెలిపారు. గత ఏడాది కోవిడ్ సమయంలో కూడా ఆన్లైన్ శిక్షణా తరగతులు నిర్వహించామని గుర్తు చేసారు. అదేవిధంగా గతంలో ఆసక్తి వున్న జర్నలిస్టులకు, విద్యార్థులకు మూడు నెలల సర్టిఫికేట్ కోర్సులు నిర్వహించామని, ప్రస్తుతం దానిని ఆరు నెలలకు పొడిగిస్తూ డిప్లొమా కోర్సుగా నిర్వహించటానికి ఆచార్య నాగార్జున విశ్వ విధ్యాలయంతో అంగీకారం కుదిరందని తిలక్ వివరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అభ్యర్థులకు ఉపయుక్తంగా వుండే విధంగా సిలబస్ తయారు చేయటానికి ఆంధ్ర విశ్వ విద్యాలయం, నాగార్జున, పద్మావతి మహిళా, బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాల జర్నలిస్ట్ విభాగాది పతులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. జర్నలిస్టుల ఎక్రెడిటేషన్‌కు సంబంధించి నిభంధనలు కొంత మేర సడలించడానికి చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళారని తెలిపారు. ఇప్పటికే వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సి.ఇ.ఓతో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు జర్నలిస్టుల ఆరోగ్య పథకం పై చర్చించారని, జర్నలిస్టులకు ఆసుపత్రిలో అడ్మిషన్ సమయంలో ఎదురయ్యే సమస్యలకు ఆరోగ్య మిత్ర కార్యకర్తలను సంప్రదించాలని తిలక్ సూచించారు. 104 డయల్ చేసి 4 ప్రెస్ చేయటం ద్వారా ఆరోగ్య శ్రీ సమస్యలను జర్నలిస్టులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. గోవింద రాజులు, డివిజినల్ పౌర సంబంధాల అధికారి పి.రాములు, సహాయ సమాచార ఇంజినీర్ పి.శ్రీనివాస రావు, ప్రెస్ అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

మోద కొండమ్మ సన్నిదిలో పూజలు

పాడేరు టౌన్: గిరిజనుల, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారిని రాష్ట్ర ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు, డివిజనల్ పిఆర్ఒ పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ట

ప్రజాశక్తి-హుకుంపేట: మఠం పంచాయతీ మత్స్యగుండంలో మత్స్య లింగేశ్వరస్వామి ఆలయంలో మత్స్య లింగేశ్వర స్వామి ఆలయంలో దాతల ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన ధ్వజస్తంభాన్ని శనివారం మఠం సూర్యనారాయణ నాయుడు, టి.అప్పారావు, గ్రామ సర్పంచ్ మఠం శాంత కుమారి ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

సమస్యలతో గిరిజనం సతమతం

- దాహార్తితో అల్లాడుతున్నా పట్టని వైనం
- కల్వర్టు కూలి, బస్సు సర్వీసు రద్దుతో జనం అవస్థలు
- బిల్లులు అందక ఇళ్ల లబ్ధిదారుల అగచాట్లు
- సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- తక్షణ చర్యలు చేపట్టాలి : గిరిజన సంఘం

నీరివ్వని సోలార్ నీటి పథకం ట్యాంకు పరిశీలనలో గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే గిరిజన గ్రామాల్లో తాగునీరు, రహదారులు, ఇతరత్రా మౌలిక సౌకర్యాలు లేకు గిరిజనులు అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.సిరిమల్లెరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేములకొండ పంచాయతీ చెలకవీధి, రాకోట తదితర గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెలకవీధి గ్రామం సిద్ధుగూడెం వీధిలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటు పత్తా లేదని, ఉన్న రెండు బోర్లు పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సోలార్ నీటి పథకం ఉన్నప్పటికీ, అరకొరగానే నీళ్ల వస్తున్నాయన్నారు. భూగర్భజలాలు నీటి మట్టం తగ్గి, చాలా లోతున నీరు వుండడంతో సోలార్ పథకం మోటారు ద్వారా సగం ట్యాంకు నీరు కూడా రావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారన్నారు.దీంతో కొందరికే,అదీ అరకొరగానే నీరు అందుతోందన్నారు. వెట్టిచెలకలు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్మించే ఇళ్లకు నేటికి బిల్లులు చెల్లించలేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాకోట గ్రామంలో రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. రోడ్డుమార్గంలో వంతెన తూరలు కూలిపోయి, రక్షణగోడలు లేక, కోతకు గురై ఇరుకుగా మారడంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. రోడ్డు అధ్వానస్థితితో వేములకొండ గ్రామం నుండి రాకోట మీదుగా చెలకవీధి గ్రామానికి బస్సు సౌకర్యం నిలుపుదల చేశారన్నారు. దీనిపై అధికారులు స్పందించి, తూరల కూలి ప్రయాణానికి అనువుగా లేని కల్వర్టుకు మరమ్మతులు లేదంటే, పునర్మిర్మాణ పనులు చేపట్టి ఈ మార్గంలో రద్దయిన బస్సును పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరారు.

అక్కడ గ్రామస్తులు చెతున్నారని,దీన్నీ పునరుద్ధరించే దిశగా రోడ్లు నిర్మించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని,గిరిజన అభివద్ధి పట్ల నిర్లక్ష్యం తగదని,వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలుపై ఇలానే ఉంటే,ఎవరు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సాదాల విద్య సాగర్ రెడ్డి,చెలకవీధి గ్రామస్తులు పల్లాల బాలకష రెడ్డి, కుర్లా చిన్న రెడ్డి, కుండ్ల యాకోబు రెడ్డి, కుర్లా రత్న రెడ్డి, కుర్లా బొజ్జి రెడ్డి, పల్లాల విష్ణు వర్ధన్ రెడ్డి ,రా కోట గ్రామస్తులు కుండల మంగి రెడ్డి, కుర్లా చిరంజీవి, కుండల రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత సిరిమల్లెరెడ్డి

డొక్కు బస్సులతో ఎన్నాళ్లిలా తిప్పలు!

ప్రజాశక్తి-సీలేరు: సీలేరు వంటి ప్రాంతాలకు నడుపుతున్న బస్‌సర్వీసుల కండిషన్‌లో ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈరూటులో తిరిగే ఒకటి రెండు సర్వీసులను డొక్కు బస్సులే వేస్తుండడంతో తరచూ ఎక్కడో ఒకచోట ఏదో ఒక సమస్యతో నిలిచి, ప్రయాణికులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకుంటోందని వాపోతున్నారు

శనివారం సాయంత్రం. జీకే వీధి మండలం ధారకొండలో బస్సు టైర్లు పంచర్ కావడంతో నిలిచిపోయింది. పాడేరు డిపోకు చెందిన బస్ సర్వీస్ పాడేరులో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి చింతపల్లి, సీలేరు మీదగా డొంకరాయి వెళ్లే బస్ సర్వీస్ వస్తుండగా మార్గమధ్యం సప్పర్ల ఘాట్ రోడ్లో టైర్ పంచర్ కాగా, . టైరు పంచర్ వేసిన డ్రైవరు నెమ్మదిగా బస్సును దారకొండ వరకు నడుపుకుంటూ వచ్చారు. అక్కడికి వచ్చేసరికి బస్సు వెనుక ఉన్న రెండు టైర్లు పేలిపోవడంతో సుమారు రాత్రి 7 గంటల వరకు బస్సుదారకొండలో నిలిచిపోయింది. దీంతో బస్సులోని సుమారు 20 మంది ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన, కండిషన్ లేని బస్సులను ఇలాంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడడమే కాకుండా ఇబ్బందులు పాల్జేస్తున్న ఆర్‌టిసి అధికారులు తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. . కాలం చెల్లిని బస్సులు సుదీర్ఘ ప్రాంతాలకి నడపడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు మేల్కొని, ఘాట్‌రోడ్డులో మంచి కండిషన్ ఉన్న బస్సులను నడపాలని కోరుతున్నారు.

ధారకొండలో నిలిచిన ఆర్‌టిసి బస్సు

శాటిలైట్ డిపోతో సౌకర్యాలు మెరుగు

ఆర్‌టిసి ఒకటో జోన్ ఇడి రవికుమార్

స్థలపరిశీలన చేస్తున్న ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లాతోపాటు తెలంగాణ ముంపు మండలాల ప్రయాణికులకు బస్సు సౌకర్యం కల్పనకు ఆర్‌టిసి చర్యలు చేపడుతోందని ఆర్‌టిసి జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీలేరులో శాటిలైట్ బస్సు డిపో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. శనివారం జీకే వీధి మండలం సీలేరులో స్థానిక శివాలయం సమీపంలో గ్యాస్ గోదాం పక్కన ఎపి జెన్‌కో ఆధీనంలో ఉన్న ఐదు ఎకరాల స్థలం శాటిలైట్ డిపో ఏర్పాటుకు ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే చేసి గుర్తించగా, ఆ స్థలాన్ని ఆర్‌టిసి అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం, సంస్థ ఆదాయాన్ని మరింత పెంచే చర్యల్లో భాగంగా పాడేరు నుంచి సీలేరు మీదుగా ఏటిపాక వరకు, అక్కడినుంచి పాడేరు తిరిగి వెళ్లేందుకు కొత్తగా రెండు బస్సు సర్వీసులు త్వరలో ప్రారంభిస్తామనివెల్లడించారు. ముఖ్యంగా ముంపు గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్ర కార్యాలయాలకు రావడానికి వీలుగా ఈ బస్సులు తిప్పుతామని తెలిపారు. సీలేరులో శాటిలైట్ బస్సు డిపో అతిత్వరలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. సీలేరు నుంచి చింతపల్లి, చింతపల్లి నుంచి సీలేరు ఒరిస్సాకు బస్సులు రెగ్యులర్‌గా నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు పాడేరు డిఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణపై శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ షేక్ సలీం బాషా

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ సమావేశమందిరంలో శనివారం పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణనిచ్చారు. అల్లూరి జిల్లా డిఇఒ షేక్ సలీం భాషా ఆధ్వర్యంలో రంపచోడవరం డివిజన్‌లోని 11మండలాల్లోని పదోతరగతి పరీక్ష కేంద్రాల సూపరెంటిండెట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించి, ఈ మేరకు వారికి తగు సూచనలు చేశారు. విద్యావిభాగం సెక్రటరీ ఎం.వెంకటరావు, అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్ పాల్గొని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు.

గ్లకోమాపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రపంచ గ్లగోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం అధ్వర్యంలో స్థానిక సచివాలయంలో శనివారం గొడిచెర్ల పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో గ్లకోమాపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, 40 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ కంటి పరీక్షలతో పాటు గ్లకోమా పరీక్షలు ప్రతీ సంవత్సరం విధిగా చేయించుకోవాలని సూచించారు. గ్లకోమాతో కంటిలో ఒత్తిడి (ఐ ఓ పి) ఎక్కువై తద్వారా కంటి లోపల రెటీనా లో నరాలు దెబ్బతిని చూపు శాశ్వతంగా పోతుందని తెలిపారు. గ్లకోమా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతీ సంవత్సరం గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. అప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు మాట్లాడుతూ, గ్లకోమా నిర్ధారణ పరీక్షలకు అనకాపల్లి ఎన్.టి.ఆర్ ఆసుపత్రిలో ప్రత్యేక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ముందుగా గుర్తిస్తే ఈ వ్యాధిని చాలా వరకు నివారించ వచ్చునని తెలిపారు.ఈ శిబిరంలో సుమారు 55 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 104 వైద్యాధికారి కీర్తినిధి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, వైద్య సిబ్బంది త్రినాథ్, ఝాన్సీ, రత్నం, నవరంజిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నక్కపల్లి: త్వరిత గతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు లబ్ధిదారులకు సూచించారు. నక్కపల్లిలో జగనన్న లే అవుట్‌ను శనివారం సందర్శించారు. గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేగంగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జగనన్న లేఅవుట్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. హౌసింగ్ ఏఈ రాజు, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ నాగభూషణం, వర్క్ ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గొలుగొండ: జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అగ్రికల్చరల్ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేటట్లుగా లబ్ధిదారులకు అధికారులు అందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అంతకు ముందు చిన్నయ్యపాలెం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, తహశీల్దార్ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-నక్కపల్లి: పండగలలో అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే చర్యలు తప్పవని డిఎస్‌పి ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త అమావాస్య, పండగల సందర్భాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అసభ్య డాన్సులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు .రాత్రి వేళలో గస్తీ నిర్వహణ, వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. సుధూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో శనివారం తెల్లవారుజాము నుండి ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.కొండపైన, దిగువ ఉపాలయాల్లోనూ వెంకన్నను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివరాం కోరారు. శనివారం వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సచివాలయ పరిధిలో సొంత స్థలాలలో ఇల్లు నిర్మించుకునే అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. తాగునీటి, విద్యుత్ దీపాల సమస్యలు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. జగనన్న కాలనీల వద్ద లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటి పన్నుల వసూలుపై వాలంటీర్లు దృష్టి సారించి గ్రామానికి ఆదాయ వనరులు సమకూర్చాలన్నారు. అనంతరం పశువర్ధక శాఖ 50శాతం సబ్సిడీతో సరఫరా చేస్తున్న గడ్డి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం ఆపాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అంగన్వాడి నాయకులను పోలీసులతో భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాన్ని ఆపాలని చూడటంపై సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై పోలీసుల నిర్బంధాలను తక్షణమే ఆపాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ వెళ్లకుండా ముందస్తు అల్లూరి సీతారామరాజు జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మిని ముందస్తుగా పోలీసులు అడ్డుకోవడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడి యూనియన్ నాయకులను పిలిచి డిమాండ్ల పరిష్కారం చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వ్యతిరేకతను చూసైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. తక్షణం అంగన్వాడీలపై పోలీసు నిర్బంధాన్ని ఆపాలని తెలిపారు.

టిడిపి నేతల విజయోత్సవ ర్యాలీ

ఎమ్మెల్సీగా ఎన్నికైన చిరంజీవిరావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: టిడిపి ఎమ్మెల్సీ చిరంజీవిరావు గెలుపొందడంతో మండల కేంద్రంలో వారపు శాంతలో తెలుగుదేశం పార్టీ నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కిలో బలరాం మాట్లాడుతూ, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితంతో వైసిపి పతనం మొదలైందన్నారు. ఎమ్మెల్సీ గెలుపుతో ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నయకులు జి.రామ్మూర్తి, సర్పంచ్ వి,లక్ష్మణరావు, అరకు పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సన్యాసమ్మ, బాపూజీ, కిషోర్, ప్రభాకర్, టిఎన్ఎస్ఎఫ్ మండల అధికార ప్రతినిధి పెనుమాల చిరంజీవి, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సి వేపాడ చిరంజీవిరావును పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు సివేరి దొన్నుదొరలు శనివారం విశాఖలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా దాసు బాబు మాట్లాడుతూ, చిరంజీవిరావు గెలుపుతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో తెలుగుదేశం పార్టీలో నూతన ఉత్తేజం వచ్చిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని మెజారిటీ వస్తుందన్న ధీమాకు ఈ గెలుపుతో మరింత బలాన్నిచ్చిందని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇటువంటి తీర్పే పునరావృతం కాబోతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహదేవ్, వార్డు సభ్యులు నాగరాజు, త్రినాథ్, పాడి చందు తదితరులు ఉన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో టిడిపి నేతలు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమం లో పెదబయలు మండల కార్యదర్శి పంగి నగేష్‌రావు, అరకు రైతు సఘం అధ్యక్షులు కుడా భూషణరావు, మాజీ సర్పంచ్ త్రిసభ త్రినాథ, కర్జ అచిబాబు, మహిళ అధ్యక్షురాలు కిముడు మహేశ్వరి, అరకు ఎస్టి సెల్ ఉపాధ్యక్షులు సొల్లంగి రవి కుమార్, కడలి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో ర్యాలీ చేస్తున్న నాయకులు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి : రైతులు వేసవి దుక్కులు చేపట్టి చిరుధాన్యాల సాగు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టిఎస్ రాజ్ కమల్ సూచించారు. మండలంలో శనివారం వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో కాగిత, దేవవరం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పంట పొలాలను సందర్శించారు. వేసవి దుక్కులు, అపరాలు - చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవి దుక్కులు చేపట్టి చిరుధాన్యాలైన ఊదలు, గంట్లు, రాగులు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకుంటూ కేవలం 250-400మి.లీ వర్ష పాతం సరిపోతుందని, ఎరువులు, పురుగు మందులు అవసరం కూడా ఉండదని తక్కువ పెట్టుబడితో అపరాలు సాగు చేయవచ్చునని తెలిపారు. అపరాలు, చిరుధాన్యాలు ఆరోగ్య పరంగా కూడా ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. మధు మేహం, గుండె జబ్బులు వున్న వారికి ఈ ఆహారం ఔషదంగా ఉపయోగ పడుతుందన్నారు. అపరాలు, చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట: చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని అనకాపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు అన్నారు. కొత్తకోటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సుమారు పరీక్షా సామగ్రి అట్టలు, పెన్నులు ఉచితంగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలన్నారు. మరింతగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, వసతి గృహ సంక్షేమ అధికారి రాము, దళిత సంఘం నాయకులు యాదగిరి దాసు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: చదువుతో మంచి స్థాయికి చేరుకోవచ్చని అనకాపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు అన్నారు. శనివారం నర్సీపట్నం ఎస్సీ బాలికల వసతి గృహ 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పరీక్షా అట్టలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నూకరాజు, ఉపాధ్యాయులు గాయత్రీ, అప్పలరాజు, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మి, దళిత సంఘ నాయకులు యాదగిరి దాసు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని పాకలపాడు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టీడీపీ మండల కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు బుర్ల రమణ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: పైడిపాల రెవెన్యూ సర్వే నంబరు 711లోని చెరువులో తుమ్మచెట్లను నరికిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ప్రసాదరావు పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నరికినట్లు అందిన సమాచారంతో కలప తరలించకుండా వీఆర్ఎను కాపలా ఉంచామన్నారు. కలప కోసం చెట్లను నరకడం చట్టరీత్యా నేరమని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంకాం కోర్సులో బోధించుటకు ఎంకాం ఫస్ట్ క్లాస్‌లో పాసైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ప్రథమ స్థాయి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాశాలలో పని చేయుటకు తోటమాలి, కళాశాలకు స్కిల్ హబ్ సెంటర్లో పని చేయుటకు ఒక స్వీపర్‌కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు అభ్యర్థులు స్వయంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.

విద్యాంజలి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

సైనిక స్కూల్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట విద్యాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న రొంగల కీర్తి ప్రవస్తి, 6వ తరగతి చదువుతున్న సియ్యాద్రి కార్తికలు ఇటీవల జరిగిన సైనిక స్కూల్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కార్తిక (6,976ర్యాంకు), కీర్తి ప్రవర్తి (7750) జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో వీరు ఇద్దరు తమిళనాడు రాష్ట్రంలోని వికాస్ సైనిక్ స్కూల్‌లో సీటు పొందారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను విద్యాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ గట్టా వర ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

నూకాలమ్మ సన్నిధిలో చైర్‌పర్సన్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్థానిక అబీద్ సెంటర్లో నూకాలమ్మను మున్సిపాలిటీ చైర్పర్సన్ ఆదిలక్ష్మి దర్శించుకున్నారు. కొత్త అమావాస్యకు జరిగే పండగ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ,నూకాలమ్మ పండగ సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, నూకాంబిక దేవాలయ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, యూత్ ప్రెసిడెంట్ ధనిమిరెడ్డి ప్రసాద్, నాయకులు కర్రి గోవిందు పాల్గొన్నారు.

దగ్ధమైన ఇంటి వద్ద బాధితులు

ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కొమరాపురం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై, రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించింది, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కొమరాపురం గ్రామంలోని లోసుల శేఖరబాబుకు చెందిన తాటాకింటిలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా, అదే సమయంలో భారీగా గాలులు వీయడంతో ఇంటి పైకప్పుకు మంటలు వ్యాపించి దగ్ధమైంది.అప్రమత్తమైన స్థానికులు మంటలను పక్కనున్న ఇళ్లకు వ్యాపించకుండా అదుపుచేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అయితే ఈ ప్రమాదంతో శేఖర్‌బాబు ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోవడంతోపాటు పైకప్పు పూర్తిగాదగ్ధమైంది.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఈ నెల 24లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ దేవమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగంపల్లి మినీ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త, అలాగే శరభవరం అంగన్వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి, దరఖాస్తు చేసుకునే నాటికి 21 -35 ఏళ్ల వయస్సున్న వివాహితులైన స్థానిక ఎస్‌టి మహిళలే అర్హులన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా అందజేయాలని సూచించారు.

దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మి వేస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని మార్చుకోవాలని, ఈ కర్మాగారాన్ని యధావిధిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 714వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచీ కేంద్రం చర్యను వ్యతిరేకిస్తూ రెండేళ్లుగా పోరాటం సాగుతోందని తెలిపారు. ఆ కారణం వల్లే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్సీని డిపాజిట్ లేకుండా ఓడించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా బిజెపి తన వైఖరిని మార్చుకోవాలన్నారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.నర్సింగరావు, సంతోష్ కుమార్, డి.రామారావు, విజయ పాల్గొన్నారు.

విశాఖలో క్రికెట్ సంబరం

నేడు భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్
పొంచి ఉన్న వర్షం ముప్పు
నగరానికి చేరుకున్న క్రికెటర్లు
స్టేడియం సమీప ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు

వన్డే మ్యాచ్ జరిగే పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం

ప్రజాశక్తి - పిఎం.పాలెం, ఎంవిపి కాలనీ, కలెక్టరేట్ విలేకరులు

విశాఖ.. క్రికెట్ క్రీడా సంబరానికి సిద్ధమైంది. ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య విశాఖపట్నంలోని ఎసిఎ - విడిసిఎ డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరుగనున్న రెండో వన్డే మ్యాచ్‌కు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అయితే, ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. శనివారం స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. ఆకాశం మేఘావృతమై ఉంది. భారీ వర్షాలకు అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో క్రీడాభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. వరుణుడు కరుణించి మ్యాచ్ జరగాలని వారంతా కోరుకుంటున్నారు. మరోపక్క మొదటి మ్యాచ్ ముగిసిన అనంతరం శనివారం సాయంత్రం భారత్, ఆస్ట్రేలియా జట్లు ముంబయి నుంచి విశాఖకు చేరుకున్నాయి. వారు విశాఖలో అడుగుపెట్టే సమయానికి వర్షం స్వాగతం పలికింది. ఇరు జట్లూ విమానాశ్రయం నుంచి వారికి బస ఏర్పాటు చేసిన రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నాయి.

పటిష్ట ఏర్పాట్లు

ఈ వన్డే క్రికెట్ మ్యాచ్‌నకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 నుంచి రాత్రి 10:30 వరకు మ్యాచ్ జరుగనుంది. మ్యాచ్ ప్రారంభమయ్యే సమయానికి వర్షం తగ్గుముఖం పడుతుందన్న ఆశాభావాన్ని క్రీడాభిమానులు వెలుబుచ్చుతున్నారు. ఎంతటి పెద్ద వర్షం పడినా అరగంటలో మైదానంలోని వర్షం నీరు పోయేలా అండర్ గ్రౌండ్ డ్రైన్ సిస్టమ్ ఇక్కడ ఉండటాన్ని విశేషంగా చెప్పుకోవొచ్చు. 28 వేల మంది సామర్థ్యం కలిగిన ఈ స్టేడియం మొత్తం క్రీడాభిమానులతో నిండిపోనుంది. ఇప్పటికే టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. మ్యాచ్ నేపథ్యంలో ప్రత్నామ్నాయ రోడ్డు మార్గాలను అధికారులు సూచించారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలలో ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ వన్డే మ్యాచ్ ఆదివారం పడటంతో ప్రేక్షకుల తాకిడి కూడా ఎక్కువగానే ఉండనుంది. ఈ నేపథ్యంలో ఎటువంటి అపశృతులూ దొర్లకుండా స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోని అన్ని గేట్ల వద్దా ఎసిపి స్థాయి అధికారులను నియమించారు. అంతర్జాతీయ మ్యాచ్ కావడంతో మూడంచెల భద్రతను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు రెండు వేల మంది అధికారులు, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో ఉన్నారు. మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చే ప్రేక్షకులు సరైన టికెట్లు లేదా ఎంట్రీ పాస్ కలిగి ఉండాలని, నిర్దేశించిన గేట్ల ద్వారా రెండు గంటల ముందుగా స్టేడియంలోకి ప్రవేశించాలని పోలీసు అధికారులు తెలిపారు.

ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

క్రికెట్ స్టేడియానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్ధం ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు మీడియాకు తెలిపారు. ఒహెచ్‌పిఒ 25 పి, 25 డి, 25 ఇ, రైల్వే స్టేషన్ 25 ఆర్, 25 జె, ఆర్‌కె బీచ్ 25 ఎం ప్రాంతాల నుంచి క్రికెట్ స్టేడియానికి వయా హనుమంతవాక, జోడుగుళ్లపాలెం, ఐటి సెజ్, లా కాలేజీ మీదుగా బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే కూర్మన్నపాలెం, పాత గాజువాక, ఎన్ఎడి, ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల నుంచి వచ్చే ప్రయాణికులు ఐటి సెజ్ దగ్గర దిగి అక్కడున్న స్పెషల్ బస్సుల ద్వారా క్రికెట్ స్టేడియానికి చేరుకోవొచ్చన్నారు. క్రికెట్ మ్యాచ్ పూర్తయిన తరువాత స్టేడియం నుంచి క్రీడాభిమానులు బయలుదేరి వారి ప్రాంతాలకు చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్‌కు పట్టభద్రుల జెల్ల

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'రాష్ట్రంలో అభివృద్ధి మెథడ్‌లో పాలన సాగలేదు. డిస్ట్రక్షన్ మోడల్‌లో సాగింది. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు జగన్మోహన్ రెడ్డిని నమ్మలేదు. వైసిపి అభ్యర్థిని ఓడించారు' అని టిడిపి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు జరిగిన పలు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి గెలుపొందారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించడం కోసం వైసిపి అగ్రనేతలను మోహరించి, అనేక అక్రమాలకు పాల్పడినప్పటికీ పట్టభద్రులు వారిని నమ్మలేదన్నారు. ఈ ఎన్నికలను తాము సెమీ ఫైనల్‌గా భావించామన్నారు. సమిష్టి కృషితో విజయం సాధించామన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాజధాని పేరుతో మోసగించి, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి, లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మాటలను పట్టభద్రులు నమ్మలేదని, అందుకే జగన్‌కు జెల్ల కొట్టారని ఎద్దేవా చేశారు. పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ రాజధాని అంటూ వైసిపి అగ్ర నాయకులు వేల కోట్ల విలువైన భూములను స్వాహా చేశారని ఆరోపించారు. అదానీకి సైతం అప్పగించారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే ప్రయత్నం జగన్ చేయలేదని విమర్శించారు. వీటన్నింటినీ గుర్తించి పట్టభద్రులు జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ మూడు ముక్కలను పట్టభద్రులు తిరస్కరించారని చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఘోర పరాజయం పొందినందున ఉత్తరాంధ్రలోని వైసిపి మంత్రులు, అసెంబ్లీ స్పీకరు తమ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను తాను శాసన మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, గిడ్డి ఈశ్వరి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కుటుంబ సంక్షేమ పథకంతో ప్రయోజనం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ఉపాధ్యాయులకు ఒక వరం లాంటిదని ఆ యూనియన్ కుటుంబ సంక్షేమ విభాగం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పివి .సత్యనారాయణ అన్నారు.శనివారం ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, వజ్రపు చిన్నబ్బాయిల సంతాప సభ నిర్వహించారు యుటిఎఫ్ మండల అధ్యక్షులు దాసరి పైడిమల్లి అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా మృతి చెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు, తర్వాత బాధిత కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకం ద్వారా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు పివి సత్యనారాయణ, ఎస్ .రాజబాబు, ఎం.ఉదయ్ తదితరులు మాట్లాడుతూ, మండలంలోని బట్టావారి వీధి జిపిఎస్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేసిన బీరబోయిన సుబ్బారావు, అంబేద్కర్ నగర్ జిపి పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నబ్బాయి అకాలమరణం బాధాకర మన్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.3లక్షలు చొప్పున చెక్కులు జిల్లా కుటుంబ సంక్షేమ అసోసియేట్ ప్రెసిడెంట్ పి.వి. సత్యనారాయణ అందజేశారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, ఆపద సమయంలో వారికి బాసటగా యుటిఎఫ్ ఎల్లపుడూ ఉంటుందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 7482 సభ్యులు ఉన్నారని, 336 మంది ఉపాధ్యాయులు మృతి చెందగా, బాధిత కుటుంబాలకు రూ.ఐదు కోట్లకు పైగా సంఘీభావ విరాళాలు అందజేశామన్నారు. యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకంలో ఉపాధ్యాయులు సభ్యులుగా చేరాలని కోరారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు పైడి మల్లు, ప్రధాన కార్యదర్శి పొట్టబోయిన రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్ టివిఎల్. ప్రసన్న, గౌరవ అధ్యక్షులు సత్యవతి, కోశాధికారి కె..శ్రీను, ఏప్ డబ్ల్యూ సెక్రెటరీ బూడి శ్రీనుబాబు, జిల్లా కౌన్సిలర్లు మిర్యాల రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రాజేంద్ర మోహన్ , సుబ్బాయమ్మ, సుభాషిణి, అలిషా రాణి, పి. రామకృష్ణ, వెంకటలక్ష్మీ, కోడూరి లోవరాజు, కారం శ్రీను, పులి సత్యనారాయణ, నీలాద్రి రాజబాబు, జంపా రాంబాబు, సాధన పల్లి సత్యనారాయణ, అడ్డాల సతీష్ , బి నూకరాజు, వి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

10న పాడేరులో గిరిజన సమాఖ్య జిల్లా మహాసభ

ప్రజాశక్తి- చింతూరు : వచ్చే నెల 10న పాడేరులో తలపెట్టిన గిరిజన సమాఖ్య జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ కోరారు. శనివారం చింతూరులోని తన స్వగృహంలో కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి, సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని, మాటలకు చేతలకు ఎక్కడా పొంతన లేదన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.సతీష్, డివిజన్ నాయకులు ఎస్‌కె.రంజాన్ పాల్గొన్నారు.

'అనగనగా కథలా' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వర్ధమాన నటుడు, విశాఖ వాసి కంచర్ల ఉపేంద్ర నటించిన 'అనగనగా కథలా' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు కంచర్ల ఉపేంద్ర, సీనియర్ పాత్రకేయులు నాగబోయిన నాగేశ్వరరావు, పాత్రుడు, స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యకు తగిన నిధులు కేటాయించాలని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా రంగానికి తగిన నిధులు ఇంకా కేటాయించవలసిన అవసరం ఉందన్నారు.